# రసభంగం

"అమ్మాయికి సంగీతం వచ్చటగదా ఏదైనా ఓకృతి పాడించండి" అన్నది సీతమ్మగారు.

"దానికేం అల్లాగేపాడుతుంది" అని నాగలక్ష్మమ్మగారు భర్తవంక చూచింది. అందుకు జగన్నాధంగారు కూతురి వంక తిరిగి "ఏదమ్మా శారదా మంచికీర్తన పాడు" అన్నారు.

శారదా చాలాసేపు బెట్టుచేసింది. ఆ కీర్తనేదో సరిగా జ్ఞాపకం లేదు అన్నది. జలుబు చెయ్యడంవల్ల గొంతు బాగాలేదు అన్నది. ఆ కృతి పై స్థాయిలోతప్ప బాగుండదనీ, అంత పై స్థాయిలో తానిప్పుడు పాడలేననీ అన్నది. రకరకాల సాకులు చెప్పి తప్పించుకోవాలని చూచింది. తండ్రిచేత ఒకటికి పదిసారులు బ్రతిమిలాడించుకొన్నది. "ఏమిటమ్మా ఈ గొడవంతా ఓ పాటపాడమంటే" అనితల్లి విసుక్కొన్న తర్వాత శారద నెమ్మదిగా "ప్రక్కల నిలబడి" అన్న త్యాగరాజకృతి చాలా సామాన్యంగా పాడింది.

ఆ కృతి పూర్తిఅయ్యీ కాకముందే జగన్నాధంగారు "అద్భుతం-ఇవ్వాళ మరీ అద్భుతంగా పాడావమ్మా. నిజంగా సుబ్బలక్ష్మికంటె బాగా పాడావనుకో." అన్నారు సంతోషంతో పొంగిపోతూ. మరికొన్ని క్షణాల తర్వాత ఆయన చిరునవ్వు నవ్వుతూ మోహన్ వంకా, సుందరరామయ్యగారి వంకా చూచారు. తన ఆనందంలో అందరూ భాగం పంచుకొంటున్నారని విశ్వసిస్తూ. ఆయన సుందరరామయ్య

గారితో నెమ్మదిగా "మా అమ్మాయి పాట ఎలా ఉన్నది ?" అని అడిగారు. "బాగుంది" అని తల ఆడిస్తే సంతృప్తి కలుగక జగన్నాథం గారు "అలాకాదు మీరు నిజం చెప్పండి సుబ్బలక్ష్మి పాటకంటె బావుందా లేదా ?" అని గ్రుచ్చి అడిగేసరికి సుందరరామయ్యగారు నవ్వుతూ మీరు అంత గట్టిగా అడిగితే నేనేమి చెప్పతాను. కారణం ఏమంటే నాకు సంగీతంపట్ల అభిమానమైతే ఉన్నదికాని ఎవరిపాట ఎలా ఉన్నదీ వివరించి చెప్పగల పాండిత్యం లేదు. ఆ విషయాలు మావాణ్ణి అడగండి. ఊ అంటే ఆ అంటే సుబ్బలక్ష్మి కచేరీలకనీ, త్యాగరాజ ఉత్సవాలకనీ మదాసు వెళ్ళివస్తుంటాడు. కేవలం అభిమానమేకాక సంగీతంలో వాడు కొంత సాధన కూడా చేశాడు. కనుక ఈ విషయాలు వాణ్ణి అడగండి" అన్నారు.

ఆ మాటలు విని జగన్నాథంగారు ఎంతో సంతోషించారు. వెదకపోయినతీగె కాలికి తగలడమంటే ఇదేకాబోలు అనుకొన్నారాయన. "కాలేజీ చదువుతోపాటు సంగీతంకూడా అబ్బడం నిజంగా గొప్ప విశేషమే. మీరు నిజంగా అదృష్టవంతులు" అన్నారు జగన్నాథంగారు సుందరరామయ్యగారి వంక చూస్తూ.

శారద చిరునవ్వు నవ్వుతూ "అయితే ఇంకేం మీ అబ్బాయిగారిని కూడా ఓ కృతి పాడమనండి" అన్నది సుందరరామయ్యగారితో. పైగా ఆ అనడం కూడా మామూలుగా అనలేదు. పాడమనండి చూద్దాం ఏ మాత్రం పాడతాడో అన్నట్లు అన్నది.

శారద ధోరణి చూచి సీతమ్మగారు నివ్వెరపోయింది.

ఎవరూ ఏమీ మాటాడక పొయ్యేసరికి శారద మళ్ళీ ఆ ప్రస్తావన తెచ్చి తండ్రివైపు తిరిగి "కృతి అంతా పాడాలని లేకపోతే ఒకటి రెండు చరణాలు అన్నా చాలు. మీరు చెప్పండి" అన్నది కొంచెం

గారాబంగా మాటాడుతూ. అందుకు మోహన్ చిరునవ్వు నవ్వుతూ "ఎలా అయినా నాచేత పాడించి నవ్వాలని చూస్తున్నారు. మీ కటువంటి అవకాశం లభించదు. అందుకే ఓ షరతు పెడుతున్నాను. నేను పాడిన కాసేపూ మీరొక్కరూ చెవులు గట్టిగా మూసుకోవాలి. పాట అయిపోయింది అనేదాకా చేతులు తీయకూడదు" అన్నాడు. ఆ మాటలకు అందరూ నవ్వారు.

శారద మరింత పెద్దగా నవ్వింది. అతను చెప్పింది నిజమే అనుకొని అందరికంటె ఎక్కువసేపు నవ్వి, నవ్వు ఆపుకొని "అలా తప్పుకోవాలని చూడకండి. ఒక్కటి పాడండి." అన్నది. నాగలక్ష్మమ్మ గారు ఊరుకో అన్నట్లు కూతురువంక కొంచెం కోపంగా చూచింది. శారద 'మరేం పర్వాలేదు' అన్నట్లు తల ఎగరేసి వెంటనే తండ్రివంక 'తిరిగి'సంగీతంలో సాధన చేసినవారు ఓచరణం పాడితే తప్పేముందండీ మన అందరికీ సంగీతం అంటే ఇష్టం కనుక పాడమని కోరుతున్నాం. మీరు ఆడగండి" అన్నది.

నాగలక్ష్మమ్మగారు ఇక లాభం లేదనుకొని దూరంగా గుమ్మానికి ఆవలి వైపున సీతమ్మగారితో మాటాడుతూ కూర్చున్నదల్లా లేచి హాల్లోకివచ్చి "మీరు ఓ సారి ఇలా వస్తారూ" అని పిల్చింది. అందరూ సంతోషంగా నవ్వుకొంటూ ఉన్నప్పుడే "తథాస్తు" అనుకొంటే మంచిదని శారద అనవసరపు సంభాషణ కొనసాగకుండా ఉండడం అన్ని విధాలా మేలనీ అనుకొన్నది. కాని జగన్నాధంగారు కూర్చున్న చోటనుంచి కదలలేదు.

"పోనీ నేను లోపలికివెళ్ళి కూర్చుంటా మీరు పాడండి" అని శారద నెమ్మదిగా లేచి నిలబడి ఒకక్షణం ఆగి తల్లి దగ్గరకు బయలుదేరింది.

కాని సగం దారిలోనే ఆగిపోయింది.

చకిత అయ్యింది శారద.

శారద ఒక్కతేకాదు అక్కడ ఉన్నవారందరూ చకితులయ్యారు.

"నన్నుతించి శ్రీరామచంద్రుదు తలవలేదు మనసా
కన్న విన్నవారి వేడికొన్న ఏమి ఫలము మనసా"

అంటూ అను పల్లవితో ప్రారంభించి

' ఎన్నగాను రామ భజన
కన్న మిన్న యున్నదా'

అని పల్లవిపాడి, అత్యంత మధురంగా,

'రామచిలుక నొకటిపెంచి
ప్రేమ మాటలాడ నేర్పి
రామ రామ రామ యనుచు
రమణి పిల్వగా ప్రేమమీర భద్రాద్రి
ధాముడైన రామ విభుడు
కామితార్థ ఫలము లిచ్చి
కైవల్య మొసగ లేద '

అంటూ అన్ని చరణాలూ పాడి రాగం వినిపించి కీర్తన పూర్తి చేశాడు.

జగన్నాథంగారు చాలా సంతోషించారు.

సుందరరామయ్యగారు లోలోపల పొంగిపోయ్యారు. వారిద్దరేకాదు గుమ్మం అవతల కూర్చున్న అతని తల్లి సీతమ్మగారూ, శారద తల్లి నాగలక్ష్మమ్మగారూ కూడా ఆతని పాట విని సంతోషించారు. అందరి ముఖాలలో సంతోషం పరిస్ఫుటంగా కన్పించింది. జగన్నాథంగారు

తలవంచుకొని కూర్చున్న కూతురివంక తిరిగి "ఏమమ్మా శారదా అబ్బాయి పాట ఎలా ఉన్నది. నిజంగా గొప్పగా లేదూ ?" అన్నారు. జడవెనుక నుంచి ముందుకు వేసుకొంటూ శారద నవ్వుతూ "గొప్ప అనుకరణ" అన్నది.

శారద ధోరణి బాగుండలేదనీ, మోహన్ నొచ్చుకొంటాడేమోననీ అనుకొని భయపడి సుందరరామయ్యగారే కల్పించుకొని ఆ మాట మారుస్తూ మావాడు గాత్రంకంటె వయొలిన్ మీద ఎక్కువ సాధన చేశాడండీ" అన్నారు జగన్నాథంగారితో. అందుకాయన మరింత సంతోషిస్తూ "అహా అల్లాగా" అన్నారు. శారద వారి సంభాషణలో కలుగచేసుకొని అకారణంగా పెద్దగా నవ్వుతూ "వయొలిన్ కూడానా" అన్నది ఎగతాళిగా. ఎందుకు ఏ విషయం ఎగతాళి చేస్తున్నదో అక్కడ. ఎవరికీ అర్థంకాలేదు. జగన్నాథంగారికి కొంచెం కోపం కూడా వచ్చింది. కూతురివంక కోపంగా చూచారు.

శారద తలవంచుకొన్నది.

శారద అల్లా ఎగతాళిగా మాటాడిందనే మోహన్ అప్పటికప్పుడు ఇంటికివెళ్ళి తన ఫిడేలు తెచ్చి పెట్టమని తల్లిని కోరాడు. "అదేమిటొరి పెండ్లి కూతురు చెయ్యవలసిన పని నువ్వు చేస్తున్నావ్ ఇప్పుడెందుకు లేరా" అంటూ సీతమ్మగారు అడ్డుచెప్పినా అతని బలవంతంపై చివరకు వెళ్ళక తప్పిందికాదు. ఆవిడ వెళుతుండా "నేనూవస్తా పదండి" అని ఆవిడవెంట నాగలక్ష్మమ్మగారు కూడా బయలుదేరింది.

వాళ్లు తిరిగి వచ్చేదాకా ఏదో మాట్లాడుతూ ఉండవచ్చునని జగన్నాథంగారే మళ్ళీ సంభాషణ మొదలుపెట్టి సుందరరామయ్యగారితో "మీవాడికి ఇవన్నీ ఎప్పుడు నేర్పారండీ - ఎప్పుడూ చెప్పావుకావే, మొత్తంమీద నువ్వు గొప్ప అదృష్టవంతుడివే." అని అతనివంక తిరిగి

"ఏమయ్యా మోహన్ వయొలిన్‌పై కూడా గట్టి సాధనే చేశావన్నమాట!" అన్నారు. మోహన్ చిరునవ్వుతో "ఏదోకొంచెం" అన్నాడు సందర్భంలేక పోయినావారి సంభాషణలో కల్పించు కొని శారద "ఏమో నాకు వీణ అంటేనే ఎక్కువమోజు. అంతేకాదు. ఫిడేలు నేర్చుకోడానికి మంచిగురువు లభించదన్న అనుమానం కూడా ఉంటూ వచ్చింది" అన్నది ఆ మాటలపై సంభాషణ పెరిగింది.

మోహన్ నెమ్మదిగా "అదేమిటి అలా అంటారు. మన కోటి వాళ్ళం నేర్చుకోడానికి గురువులే లభించనంత గొడ్డుపోలేదీ దేశం. ఈ రంగంలో మహావిద్వాంసులుగా పేర్కొనదగిన వారి సంఖ్య దక్షిణాది వారితో పోలిస్తే తక్కువే అయినా ఆంధ్రదేశంలో పండితులకే నాడూ లోపంలేదు. కావలసినంత మంది ఉన్నారు. ఉన్నవాళ్లకు సరియైన ఆదరణ గౌరవం ఉన్నాయా అని!" అన్నాడు. శారద వెంటనే అందుకొని వాళ్లు నిజంగా గొప్ప వాళ్లయితే ఆదరణ, గౌరవం అవే లభిస్తాయి అన్నది. అందుకుమోహన్ ఇతరత్రా అయితే మీరన్నది నిజం కావచ్చు. కాని మన రాష్ట్రంలో మాత్రం అది నిజంకాదు. ఇక్కడ సంగీతానికి తగిన ప్రచారం లేదు పండితులు రాణించేందుకు మంచి అవకాశాలు లేవు ఇవన్నీ కాక కొందరు ఆధునికులు మన శాస్త్రీయ సంగీతాన్ని వెక్కిరించడం ఒక ఫాషనుగా భావిస్తున్నారు. దేశంలో మహా పండితులు చాలా మందే ఉన్నా వారికి గౌరవ ప్రతిష్ఠలు, సరియైన ఆదరణ లభించక పోవడానికి మరో ప్రత్యేక కారణంకూడా ఉన్నది. అదేమంటే మన తెలుగు వాళ్ళల్లో ఉన్నంత మాత్సర్యం ఇంక మరెవ్వరికి ఉన్నట్లు నాకు కన్పించలేదు." అన్నాడు. అందుకు జగన్నాధంగారు నిజమే నువ్వు చెప్పింది నిజమే. మద్రాసులో అక్కడా త్యాగరాజు ఉత్సవాలలో ఈ విషయం స్పష్టం అవుతూ ఉంటుంది. వాళ్ళకు వాళ్లవాళ్లంటే ఎంత అభిమానమో!" అన్నారు. శారద

ఊరుకోక తన్నేమో అన్నట్లు రోషపడుతూ "ఇతర విషయాలు వదిలేద్దాం. ఒక్క ఫిడేలు విషయం చెప్పండి. మనం పెద్ద ఈర్ష్యపడి చచ్చి పోవలసిన వయొలిన్ విద్వాంసులు ఎవరున్నారండీ ఆంధ్ర దేశంలో ?" అని ఇంకా ఏమో చెప్పబోతూ సీతమ్మగారూ ఆవిడ వెంట తల్లీ రావడం చూచి మాటాడడం మానివేసింది శారద.

నాగలక్ష్మమ్మగారు లోపలకు వెళుతూ భర్తను పిల్చుకొని వెళ్ళి "ఆవిడా నేనూ అన్ని విషయాలూ మాట్టాడుకొన్నాం. వారందరికీ అంగీకారంగా ఉన్నది. కచేరీలు తర్వాత పెట్టుకోవచ్చు. ముందు తాంబూలాలు పుచ్చుకోండి. ఆలస్యం అమృతం విషం అన్నారు ఈ సంబంధం చెయ్యి జారనివ్వకండి. దాన్ని కాస్త మాట్లాడకుండా ఊరోచ్చమనండి." అంటూ గట్టిగా హెచ్చరించింది. "సరేలే - నీదంతా హడావిడి మనకు అన్ని విధాలా నచ్చిన సంబంధం నేనెందుకు పోనిస్తానూ" అంటూ జగన్నాధంగారు గబగబా హాల్లోకి తిరిగి వెళ్లారు.

నాగలక్ష్మమ్మగారు అంతగా భయపడడానికి కారణం లేకపోలేదు. అంతకుముందు వచ్చిన సంబంధాలు అకారణంగా చెడిపోయ్యాయి. ప్రతి సంబంధానికీ తండ్రీ కూతురూ ఏదో వంకలు పెట్టడంవల్ల ఏ సంబంధం కుదరలేదు. శారద పెళ్ళి ఒక సమస్యగా తయారయ్యేసరికి నాగలక్ష్మమ్మగారు బెంగపెట్టుకొన్నది. 'మీ ధోరణి ఏమీ బాగాలేదు. ఇలా అయితే మనపిల్లకు పెళ్ళి ఎలా అవుతుంది ?' అంటూ నాగలక్ష్మమ్మగారు భర్తను హెచ్చరించడం మొదలు పెట్టింది. కాని ఆయన ఆవిడ మాటలు పట్టించుకోలేదు.

ఈ వ్యవహారం క్రమంగా ముదిరింది. వరుడుకి రకరకాల అర్హతలు నిర్ణయించారు. ఆస్తి, మంచి చదువు కాక స్త్రీలకు స్వాతంత్ర్యం ఉండాలని కోరే సంస్కారం ఉండాలనీ, సంగీత సాహిత్యాలలో

ప్రత్యేక అభిమానం ఉండాలనీ వారి ఆకాంక్ష. కనీసపు అర్హతలు కాక ప్రత్యేక ఆకర్షణలు ఏవో కన్పించి ఆ వరుడు శారదకు నచ్చాలి.

వరుడు కొంచెం పొట్టిగా ఉంటే మరుగుజ్జులా ఉన్నాడనీ కొంచెం పొడుగ్గా ఉంటే గేడి అనీ, ఒక్క రవ్వ లావుగా ఉంటే పిప్పళ్ళ బస్తాలా, గామాలా ఉన్నాడనీ, సన్నగా ఉంటే క్షయరోగిలా ఉన్నాడనీ స్నో, పౌడరు వాడినట్టు కన్పిస్తే సినిమా నటుడిలా అర అంగుళం మందాన కోటింగ్ వేశాడనీ ఎగతాళి చెయ్యడం శారదకు మామూలు అయ్యింది. ఆ పిల్ల అన్నదానికల్లా వంత పాడడం జగన్నాథంగారికి మామూలు అయ్యింది.

ఇందువల్లనే ఏ సంబంధం కుదురలేదు. కొన్నాళ్ళ తర్వాత సంబంధాలు రావడమే గగనమై పోయింది.

నాగలక్ష్మమ్మగారితో పాటు జగన్నాథంగారికి కూడా కొంచెం భయం కలిగింది. కొన్ని విషయాలు సర్ది చెప్పకొని కొన్ని సంబంధాల విషయంలో తమ అంగీకారం తెలియచేశారు కాని వాళ్ళు పిల్లనచ్చలేదని వెళ్ళిపోయారు.

పరిస్థితి అలా మారిన కొద్దికాలం తర్వాత నాగలక్ష్మమ్మగారు పోరి పోరి భర్త ద్వారా ఈ సంబంధం విషయంలో ప్రయత్నాలు ప్రారంభించింది. సుందరరామయ్య ఆస్తి పాస్తుల విషయం తెలుసు కనుక జగన్నాథంగారు మొదట్లో ఈ విషయమై శ్రద్ధ చూపలేదు కాని నాగలక్ష్మమ్మ మరీ పోరుపెట్టి చెప్పగా చెప్పగా మనసు సరిపెట్టుకొని వెళ్ళి మిత్రుడు సుందరరామయ్యను కొడుకునూ, భార్యను వెంట పెట్టుకొని వచ్చి పిల్లను చూచి వెళ్ళమని కోరాడు.

ఇలా వచ్చిన మోహన్‌లో అందచందాలు, చదువు సంధ్యలూ కాక సంగీతంలో మంచి పాండిత్యం, కన్పడేసరికి జగన్నాథంగారు ముగ్ధులయ్యారు.

*　　　*　　　*

తల్లీ వాళ్ళు వచ్చిన కొద్ది నిముషాలకే మోహన్ కావాలని సంభాషణ ఆపేసి ఎవరిచేతా అడిగించుకోకుండానే వయొలిన్ తీసుకొని శృతి సవరించడానికి పెద్ద ప్రయత్నమేమీ చెయ్యకుండానే కచేరీ ప్రారంభించాడు.

'వాతాపి గణపతిం భజేహం
వారణాశమ్ హర ప్రదమ్'

'శ్రీ వాతాపి గణపతిం భజేహం' అని వయొలిన్ మీద ప్రార్థన కీర్తన పలికించాడు దీక్షితార్ కీర్తన పాదాలలో మధ్య మధ్య కొన్ని సార్లు పదాలూ మరికొన్ని సారులు కొన్ని అక్షరాలూ నోటితో పలుకుతూ, మళ్ళీ అంతలో ఎంతో సున్నితంగా గాత్రం వయొలిన్ నాదంలో మిళితంచేసి రాగం పూర్తి చేస్తూ వెళ్ళాడు. కొన్నిసార్లు గాత్రం వయొలిన్ కంటె కొంచెం పెద్దగా వినిపించేలా పాడాడు. అలా పాడుతూనే గాత్రం తగ్గించి జంత్ర గాత్రముల సమ్మేళన వైభవం ప్రదర్శించాడు. మళ్ళీ అంతలో కంఠస్వరం కంటె కొంచెం పెద్దగా, స్పష్టంగా ఎంతో మధురంగా వినిపించేలా వయొలిన్ వాయించాడు. మనోధర్మం పద్ధతిలో కచేరీ కొనసాగించి అతను సంగీత కళా ప్రావీణ్యం ప్రదర్శించాడు. అతను విడిగా ఎప్పుడు పాడుతున్నదీ, ఎప్పుడు వయొలిన్‌పై వేరుగా స్వరం పలికిస్తున్నదీ విచక్షణ చెయ్యడం కష్టమై పోయింది.

పైనుంచి పాలధారలు కట్టినట్లున్న పండువెన్నెలలో విచ్చిన బొడ్డు మల్లెలు కోకొల్లలుగా విరజిమ్మినట్లయింది. వెన్నెల మల్లెపూల

నవపరిమళం ఎగజిమ్మినట్లు అయ్యింది. మల్లియల ధవళకాంతులేవో, పండు వెన్నెల జిలుగు వెలుగులేవో, పూల పరిమళమేదో, వెన్నెల చల్లదనమేదో విడబరచి చెప్పడానికి వీలుకానట్లయింది.

ప్రార్థన కీర్తన పూర్తి అయిన వెనువెంటనే అతను ముందు వయొలిన్‌పై సామరాగాలాపన చేసి -

'మానస సంచరరే బ్రహ్మణి
మానస సంచరరే'

అని మరో కీర్తన ప్రారంభించి ఆరోహణావరోహణ క్రమాలలో అతి విలక్షణమైన వైవిధ్యం ప్రదర్శిస్తూ,

శ్రీ రమణీ హృదయాబ్జ విహారే
సేవక జనమందిర మందారే మానస ...
మదశిఖ పింఛాలంకృత చికురే
మహనీయ కపోల విజితముకురే మానస...
పరమహంస ముఖచంద్ర చకోరే
పరిపూరిత మురళీ ధరాధరే-మానస

అంటూ అన్ని చరణాలూ పాడుతూ క్రమంగా వాయులీన గానంలో లీనమయ్యాడు. గాత్రం వయొలిన్ నాదంతో చక్కగా శృతి కలిసేలా చేసి క్రమంగా మైమరచి పోయ్యాడు.

అందరికీ మహదానందం కలిగింది. జగన్నాథం గారయితే పూర్తిగా మైమరచి పరవశులయ్యారు. ఆ ఆనందం సుందరరామయ్య గారికి గర్వకారణం అయింది. వారు ఇద్దరూ రాగరంగ రంజితులు అయ్యారు. స్వరవర్ణ విభూషితమైన రాగం లయాన్వితమై వీనుల విందుగా వినరాగా వారు నందనోద్యానంలో సౌహార్దం రూపుకట్టిన పూలమొక్కలే అయ్యారు. వయొలిన్ నాదం మంద మలయమారుతమే

అయ్యింది. గానామృతం చిలకరించేసరికి పులకరించి చిగురించడమే కాదు ఆ మొక్కలు కుసుమించాయి కూడానూ.

అచ్చంగా రసావిష్కరణమైనట్లు అయ్యింది.

కచేరీ పూర్తి అయిన చాలా సేపుదాకా ఎవరూ మామూలు స్థితిలోకి రాలేక పొయ్యారు. మంత్ర ముగ్ధుల్లా ఉండిపోయారు.

శారద ఆ పరిస్థితి చూచి సహించలేక పోయింది. నెమ్మదిగా తండ్రిదగ్గరకు వెళుతూ మధ్యలో ఆగి, అతనివంక చూస్తూ "అనుకరణలో మీకు మించిన వారు లేరనవచ్చు" అన్నది. అతను నవ్వి ఊరుకొన్నాడు కాని జగన్నాధంగారు తన్మయత్వంలో కూడా శారద మాటలు విని విసుక్కొన్నారు.

ఆయన కూతురువంక కోపంగా చూచారు.

శారద ఒకసారి లోపలకు వెళ్ళి అక్కడ సంభాషణ మళ్ళీ ప్రారంభమైన కొద్ది నిముషాలకు తిరిగి వచ్చింది. ఈ సారి సంభాషణ అంతా వయొలిన్ వాద్య సంగీతంపై నడిచింది. వయొలిన్ వాద్య సంగీత విద్వాంసుల విషయం ప్రస్తావిస్తూ మోహన్ ఆంధ్ర రాష్ట్రంలో ప్రసిద్ధిపొందిన పలువురు విద్వాంసుల జీవిత విశేషాలను గురించీ వారి వారి విద్వ ద్విశేషాలను గురించీ వివరించాడు. ఆ సందర్భంగా అతను కొందరిని ప్రత్యేకంగా ఘనంగా ప్రశంసించాడు. అలా కొంత సేపు గడిచింది. యావద్భారత దేశం ఎవరికి బ్రహ్మ రథం పట్టాలో ఎలా గౌరవించాలో వివరిస్తుండగా శారద హఠాత్తుగా అసందర్భంగా అతని మాటలకు అడ్డంవచ్చి అతను చెప్పేది ఖండిస్తూ "అయ్యయ్యో ఆయన మాటే చెప్పాలి - అబ్బే ఆయన తప్పులు వాయిస్తారండీ" అన్నది చప్పరించేస్తూ.

ఆ మాటకు అతను మొదట ఆశ్చర్యపడ్డాడు. ఈమె ఇలా అంటుందేమని తికమక పడ్డాడు. చికాకు పడ్డాడు. అతనికి కోపం కూడా వచ్చింది. అయినా తమాయించుకొని అతను నవ్వుతూనే కొంచెం పెద్దగా "నవ్వులాటకైనా ఒక హద్దు ఉండాలి పెద్దా చిన్నా గమనించాలి. ఏదో మీ సహపాఠి విషయం మాట్లాడినట్లు మాట్లాడేయ కూడదు" అన్నాడు మందలిస్తూ. కాని శారద అతని మాటలు లెక్క చెయ్యకుండా "ఇందులో నవ్వులాట ఏమున్నదని? అయినా ఉన్నమాటంటే మధ్య మీ కెందుకింత కోపం ?'' అన్నది.

మోహన్‌కు అప్పుడు అనుమానం వచ్చింది. అందుకే అతను "మీరు ఎవరి విషయమో అనుకొంటున్నారు నేను చెబుతున్నది...'' అని వివరిస్తుండగా శారద అడ్డువచ్చి "ఆయనే లెండి ఆ పేరుతో మరెవ్వరున్నారూ ?'' అన్నది. అలా అని శారద మళ్ళీ ఆ మాటే రెట్టించింది

మోహన్‌కు ఒళ్లు మండింది.

చాలా కోపంగా శారద వంక చూచాడు. శారద నిర్భయంగా నవ్వుతూ "మీకెందుకండీ ఇంత ఉలుకు. మీరేమన్నా ఆయన శిష్యులా?" అన్నది అందుకు అతను వెంటనే "అంతటి అదృష్టం నాకు పట్టలేదు" అన్నాడు. శారద కనీసం అప్పుడైనా మాట మార్చవలసింది. కాని అలా చెయ్యలేదు. పైపెచ్చు ఇంకా ఎక్కువ దూకుడుగా హెచ్చుస్థాయిలో మాట్లాడడం మొదలు పెట్టింది. అతనికి లోపల్లోపల కోపం పెరిగి పోతోంది. ఒక వంక ఆపిల్ల మూలంగా తనకు రాబోతున్న సిరిసంపదలూ ఒక్కసారే కొట్టవచ్చినట్లు కన్పించాయి అతనికి అ పిల్ల తండ్రి ఇవ్వ చూపుతున్న 'పదివేలు' కట్నం విషయం కూడా అతనికి అప్పుడే జ్ఞాపకం వచ్చింది. కాని అతను ''ఛీ వెధవ పదివేలు" అనుకొన్నాడు

వెంటనేకాదు వెనువెంటనే. కాదు ఉత్తర క్షణంలోనే ఆయనకు అనవసరంగా ప్రచారం వచ్చింది అంటూ తానంతకుముందు అన్న మాటలు సమర్థించుకోడానికి శారద ఇంకా ఏదో చెప్పబోతుంటే అతను అడ్డు వచ్చి కోపంగా "పెద్దగా ఇంక చాలు నోరు మూసుకోవచ్చు" అన్నాడు. అంతే మళ్ళీ నోరెత్తలేదు శారద. ఆ మాటకు అందరూ ఒక్కసారి అదిరి పడ్డారు. కొన్ని క్షణాలదాకా జగన్నాథంగారు కానీ, సుందరరామయ్యగారు కానీ మాటాడలేక పోయారు. ఇద్దరూ ఏదో చెప్పడానికి ప్రయత్నించి కూడా నోరు మెదపలేక పోయారు.

అతను అంత మాట అన్నా కూడా ఎవరూ మందలించడానికి పూనుకోకపోవడం గమనించి శారద మరింత రోషపడి ఒక్క దూకున తండ్రి దగ్గరకు వెళ్ళి ఏదో చెప్పబోయే సరికి ఆయన తెప్పరిల్లుకొని "శారదా నువ్వు ముందు అవతలకు పో" అన్నారు.

శారద మరింత కోపంగా గిరుక్కున వెను దిరిగి చరచరా లోపలకు వెళ్ళింది.

శారద అటు వెళ్ళగానే మోహన్ లేచి నిలబడ్డాడు. అంతలో జగన్నాథంగారు " అమ్మాయివల్ల పొరపాటు జరిగింది అది..." అంటూ ఏదో సంజాయిషీ చెప్పడానికి ప్రయత్నిస్తుంటే మోహన్ అడ్డువచ్చి "మీరు పెద్దవారు మీరు చెప్పవలసిన అవసరంలేదు. క్షమించండి. దయచేసి నాకు శెలవిప్పించండి" అని నమస్కారంచేసి తల వంచుకొని చరచరా బయటకు వెళ్ళి పోయాడు.

— — — —